



# క్రైమ్ THE మిర్రర్ ®

Voice of Anti Corruption

## తెలంగాణ జిల్లాలు

ఆదివారం 3-05-2026 పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్

## నాణ్యమైన విద్యను అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు
## తెలంగాణ ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని ACF ప్రతిపాదన

గంధంగూడ డంప్‌యార్డ్ ఖాళీ స్థలంలో మొదటి పాఠశాల ఏర్పాటుకు ప్రభుత్వ అనుమతి కోరుతూ విజ్ఞప్తి

తెలంగాణ వ్యాప్తంగా విపరీతంగా పెరుగుతున్న పాఠశాల ఫీజులపై ఆందోళన నెలకొన్న నేపథ్యంలో, బండ్లగూడ జాగీర్, కిస్మత్‌పూర్ మరియు హైదర్‌షాకోట్‌ల ఆల్ కాలనీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని అధికారిక ప్రతిపాదన సమర్పించింది.

ఈ ప్రతిపాదన మధ్యతరగతి మరియు తక్కువ ఆదాయ కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించడంతో పాటు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధిని నిర్ధారించడం లక్ష్యంగా పెట్టుకుంది.



**ప్రతిపాదిత మోడల్ స్కూల్స్ ముఖ్య లక్షణాలు:**

- అర్హత కలిగిన అధ్యాపకులతో ఉన్నత విద్యా ప్రమాణాలు
- నియంత్రిత, అందుబాటులో ఉండే ఫీజుల నిర్మాణం
- సర్వతోముఖాభివృద్ధికి ప్రాధాన్యత: విద్య, క్రీడలు మరియు జీవన నైపుణ్యాలు
- వేలాది మంది విద్యార్థులకు సేవలందించే మౌలిక సదుపాయాలు

### వెదిరే పూలమ్మ ఫౌండేషన్ సేవలను
## ప్రశంసించిన గవర్నర్



తెలంగాణ గవర్నర్ ను కలిసిన వెదిరె మేఘా రెడ్డిమునుగోడు క్రైమ్ మిర్రర్: వెదిరె పూలమ్మ ఫౌండేషన్ చైర్మన్ వెదిరె మేఘా రెడ్డి శనివారం లోక్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ కు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.పూలమ్మ ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు మరియు అభివృద్ధి కార్యక్రమాల గురించి గవర్నర్ కు వివరించారు.పూలమ్మ ఫౌండేషన్ అందిస్తున్న సేవలను గవర్నర్ ప్రశంసిస్తూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు..



### ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్పంచులకు
## ఓటు హక్కు కల్పించాలి

**సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షులుగా యరుకల యతీశ్వర్ గౌడ్ ఎన్నిక**

**బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ వెల్లడి**

## అలరించిన వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్ క్రైమ్ మిర్రర్ : శిల్పారామం మాదాపూర్ లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం పద్మావతి ఆర్ట్ అకాడమీ మరియు సూత్ర ఇన్స్టిట్యూట్ అఫ్ ఫైన్ ఆర్ట్స్ గురువులు శ్రీ క్రాంతి కిరణ్ వారి శిష్య బృందం చే కూచిపూడి నృత్య ప్రదర్శన ఆద్యంతం అలరించింది. మొదమున, వినాయక కౌతం, నమశ్శివాయతే , బ్రహ్మాంజలి, యేహి శ్రీనివాస్, జతిస్వరం, హిమగిరి తనయే , కొలువై ఉన్నదే, దేవా దేవం, బృందావన నిలయే, తిల్లాన అంశాలను మైరా , హరిణి, యశస్వినీ, శాన్విత, హ్రితిక, సాత్విక, తన్వి, లాస్య, శాన్వి, లలిత శ్రీ మొదలైనవారు ప్రదర్శించి మెప్పించారు. ప్రముఖ నాట్య గురువులు శ్రీమతి రోహిణి కందాల, శ్రీమతి వసంత సంధ్య, శ్రీమతి కీర్తన రెడ్డి లు ముఖ్య అతిధులుగా విచ్చేసి కళాకారులను అభినందించారు.



# ఎమ్మెల్సీ ఎన్నికల్లో సర్పంచులకు ఓటు హక్కు కల్పించాలి

**ఆత్మకూరు(ఎం),మే02/క్రైమ్ మిర్రర్:**
స్థానిక సంస్థల ద్వారా ఎన్నికయ్యే ఎమ్మెల్సీ ఎన్నికలలో గ్రామ సర్పంచ్లకు కూడా ఓటు హక్కు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు.శనివారం రోజు హైదరాబాదులో జరిగిన తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశానికి జాజుల శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సర్పంచ్ల హక్కుల కోసం పోరాడుతున్న యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం రాఘవాపురం గ్రామ సర్పంచ్ అయినా ఎరుకల యతీశ్వర గౌడ్ ను తెలంగాణ సర్పంచ్ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రకటించారు.ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ద్వారా ఎన్నుకోబడే శాసనమండలి సభ్యుల ఓటు



హక్కు విషయంలో ఎంపీటీసీ, జడ్పిటిసిలకు ఓటు హక్కు కల్పించి గ్రామ సర్పంచులకు కల్పించకపోవడం చాలా అన్యాయం అన్నారు. అదేవిధంగా సర్పంచుల గౌరవ వేతనం కూడా 50 వేలకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.గ్రామ సర్పంచ్ల వద్ద పనిచేసే గ్రామపంచాయతీ స్వీపర్ కు 10 వేల నుండి 15వేల వరకు ఇస్తున్న ప్రభుత్వం సర్పంచులకు మాత్రం 6500 రూపాయలు మాత్రమే ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్ర సర్పంచ్ల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నికైన ఎరుకల యతీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ఎంతో విశ్వాసంతో రాష్ట్ర బాధ్యతలు నాపై ఉంచినందుకు రాష్ట్ర సర్పంచులకు ధన్యవాదాలు తెలిపారు.ఇదే సమయంలో ప్రజలతో ప్రత్యక్షంగా ఎన్నికైన గ్రామ సర్పంచులకు, పరోక్షంగా ఎన్నికైన ఉపసర్పంచ్లకు జాయింట్ చెక్ పవర్ కల్పించడం చాలా దారుణమని వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జాయింట్ చెక్ పవర్ను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.సర్పంచుల హక్కుల కోసం భవిష్యత్తులో రాజీ లేకుండా పోరాటం చేస్తానని యతేశ్వర్ గౌడ్ తెలిపారు.కాగా నూతనంగా సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాక అధ్యక్షునిగా ఎన్నికైన యతేశ్వర్ గౌడ్ ను బీసీ సంఘాల నేతలు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార సమితి అధ్యక్షులు బత్తిని రాజు గౌడ్, మాజీ సర్పంచ్ల సంఘం రాష్ట్ర సలహాదారులు ఘనగాని మల్లేష్, గొడుగు మహేష్ యాదవ్, తాటికొండ విక్రం, మహేష్ మేరు, ప్రవీణ్ ముదిరాజ్, తదితరులు పాల్గొన్నారు.



## నాణ్యమైన విద్యను అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు తెలంగాణ ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్స్ ఏర్పాటు చేయాలని ACF ప్రతిపాదన

ప్రతిపాదిత స్థలం
మోడల్ స్కూల్ ఏర్పాటుకు ూజఖీ సర్వే నం. 43, గంధంగూడ ను ప్రత్యేకంగా గుర్తించింది. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఈ పాత డంప్‌యార్డ్ స్థలాన్ని విద్య మరియు సమాజ అభివృద్ధి కేంద్రంగా మార్చాలనేది ఈ కార్యక్రమ ఉద్దేశం.
ప్రభుత్వ స్పందన ఈ ప్రతిపాదనను బృందం అకునూరి మురళి గారు, రిటైర్డ్ ూూ విద్యా కమిషన్ ఛైర్మన్‌కు మరియు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి కి, అధికారికంగా సమర్పించడం జరిగింది.
అధికారులు సానుకూలంగా స్పందించి, ఈ కార్యక్రమాన్ని పరిశీలనకు తీసుకుంటామని హామీ ఇచ్చారు.
ఈ కార్యక్రమంపై ప్రతినిధి మాట్లాడుతూ, "నాణ్యమైన విద్య కొందరికే పరిమితమైన విశేషాధికారం కాకూడదు. ప్రభుత్వ సహకారంతో, ఈ మోడల్ స్కూల్స్ ద్వారా తెలంగాణలో ఏ బిడ్డా ఖర్చు కారణంగా అవకాశాన్ని కోల్పోకుండా చూడవచ్చు. గంధంగూడ స్థలాన్ని మార్చడం ద్వారా నిర్లక్ష్యానికి గురైన ప్రభుత్వ భూమిని ప్రజా ప్రయోజనానికి వినియోగించడంలో ఆదర్శంగా నిలుస్తుంది." అని అన్నారు.
ప్రభుత్వం త్వరితగతిన అనుమతులు మంజూరు చేసి, అన్ని జిల్లాల్లో ఇలాంటి పాఠశాలల ఏర్పాటుకు నాంది పలకాలని ూజఖీ విజ్ఞప్తి చేసింది.
ఈ కార్యక్రమంలో ూజఖీ కమిటీ సభ్యులు వినయ్ రెడ్డి, నదీమ్, నరేందర్ బాబు, విజయ్ పద్మనాభన్, శశిధర్ రెడ్డి, హేమ శేఖర్ వాసా పాల్గొన్నారు.



## శిథిలావస్థలో ఉన్న శ్రీ హనుమాన్ గ్రంథాలయానికి పునర్జీవం కల్పించాలి

### -మంత్రి పొంగులేటికి జర్నలిస్ట్ అవుట మధు వినతి..

### -నిధుల కేటాయింపుపై కలెక్టర్‌కు ఆదేశాలు

**క్రైమ్ మిర్రర్ పాలేరు** నేలకొండపల్లి బోదులబండ ప్రభుత్వ పాఠశాలలో శనివారం మధ్యాన్నం నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో చెన్నారం గ్రామానికి చెందిన జర్నలిస్ట్, మేధావి అవుట మధు రెవెన్యూ, గృహ నిర్మాణ మరియు సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. చెన్నారం గ్రామంలో సుమారు 38 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన శ్రీ హనుమాన్ గ్రంథాలయం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుందని, గ్రామ యువత మరియు విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపయోగపడే ఈ గ్రంథాలయాన్ని తిరిగి పునఃప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రంథాలయ ప్రస్తుత పరిస్థితిని మంత్రి దృష్టికి తీసుకెళ్లిన అవుట మధు, భవనం దెబ్బతిని ఉపయోగించలేని స్థితికి చేరుకుందని వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, గ్రంథాలయ పునరుద్ధరణకు అవసరమైన నామినల్ ఫండ్స్ కేటాయింపుపై తగిన చర్యలు తీసుకోవాలని ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్‌కు ఆదేశాలు జారీ చేశారు. గ్రంథాలయం పునఃప్రారంభమైతే గ్రామంలో విద్యా, సాంస్కృతిక వాతావరణం మరింత బలోపేతం అవుతుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# నియోజకవర్గ స్థాయి ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక సమావేశం





**ఆత్మకూరు(ఎం),మే02/క్రైమ్ మిర్రర్:**యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మున్సిపాలిటీలో ఆలేరు నియోజకవర్గం స్థాయి 99 రోజుల యాక్షన్ ప్లాన్లో భాగంగా ప్రజా పాలనా – ప్రగతి ప్రణాళిక సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి,ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, ఆలేరు శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య,రాష్ట్ర మహిళా కార్పొరేషన్ ఛైర్పర్సన్ బండ్రు శోభారాణి భాస్కర్, యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి,ఆలేరు మున్సిపాల్ ఛైర్పర్సన్ బీజనా బాలమణి భాస్కర్ మరియు అధికారులు,ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాలు,సర్పంచ్లు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

# దైవ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాలు పంచుకోవాలి

**-డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి**

**-మార్కెట్ చైర్ పర్సన్ యాట గీతా నరసింహ**



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (కడ్తాల్)**

దైవ కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ పాలు పంచుకోవాలని డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆమనగల్లు మార్కెట్ చైర్పర్సన్ యాట గీతా నర్సిశీహ్మా అన్నారు. దైవ కార్యక్రమాలు మానవాళి సన్మార్గ పురోగమనానికి, సమాజ స్థాపనకు దోహదపడతాయని వారు పేర్కొన్నారు. కడ్తాల్ మండలం గానుగుమర్ల తండాలో నూతనంగా నిర్మించే తుల్జా భవాని దేవాలయ నిర్మాణ శంకుస్థాపన ఆహ్వాన పత్రికను శనివారం ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సిశీహ్మా, మాజీ జెడ్పిటిసి శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యా నాయక్ లతో కలిసి శ్రీనివాస్ రెడ్డి, గీత నరసింహ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సన్మార్గంతోనే దైవానుగ్రహం లభిస్తుందన్నారు. ఆధ్యాత్మిక చింతనతో ముందుకు సాగే వారు ఒత్తిళ్లను అధిగమించి ఆనందమైన జీవితాన్ని పొందుతారని అన్నారు. దైవ కార్యక్రమాలకు, పురాతన ఆలయాల పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. గిరిజనుల సంక్షేమం, తండాల అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు చేగురి వెంకటేష్, గురిగల్ల లక్ష్మయ్య, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు జహంగీర్ బాబా, నాయకులు చంద్రు నాయక్, సక్రు నాయక్ ,చందర్, గోపి నాయక్, హర్యానాయక్, దస్తగిరి, దెంది శ్రీనివాస్ రెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

# ఆలేరులో పలు కుటుంబాలను పరామర్శించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య





**ఆత్మకూరు(ఎం),మే02/క్రైమ్ మిర్రర్ :**యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య శనివారం రోజున ఆలేరు మున్సిపాలిటీలో పలు కుటుంబాలను పరామర్శించారు. వివరాలలోకి వెళ్లిన(1)ఆలేరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు పాము అనిత కుమారుడు పాప శివ రోడ్డు ప్రమాదంలో గాయపడగా అతనిని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.(2) ఆలేరు పట్టణంలోని కొంచెం ఆంజనేయులు మాతృమూర్తి మరణించడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.(3)ఆలేరు పట్టణంలోని గంప మనోహర్ మాతృమూర్తి మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పరామర్శించారు.(4)ఆలేరు పట్టణంలోని కాంటెస్టెడ్ కౌన్సిలర్ సుఖ పరశు రామ్ మృతి చెందడంతో వారి కుటుంబాన్నీ పరామర్శించి వారి పిల్లలకు అండగా ఉంటామని చెప్పి ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం చేసారు.



## వేసవి దృష్ట్య కూలీలు జాగ్రతలు తీసుకోవాలి : సర్పంచ్ రమాదేవి

### ఉపాధి హామీ పనులు పరిశీలించిన సర్పంచ్

**మునుగోడు మే 2 క్రైమ్ మిర్రర్:** మునుగోడు గ్రామ పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను శనివారం సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్ పరిశీలించారు. జరుగుతున్న పనుల గూర్చి ఫీల్డ్ అసిస్టెంట్ శ్యామల ను అడిగి తెలుసుకున్నారు.. .కూలీలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు..ఎండ తీవ్రత దృష్ట్యా జాగ్రతలు పాటించాలని సూచించారు..కూలీలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు.ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలన్నారు..ఫీల్డ్ అసిస్టెంట్ శ్యామల,ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు..

## అధైర్య పడొద్దు...ప్రభుత్వ పరంగా ఆదుకుంటాం!

### - డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి



**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి (కడ్తాల్)** నిరుపేదలు, బాదిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విదాల ఆదుకుంటుందని డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కడ్తాల మండల కేంద్రానికి చెందిన మంకి సంతోష అనారోగ్యతో మృతి చెందింది. శనివారం బాధిత కుటుంబాన్ని శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. మృతురాలు కుటుంబానికి రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వ వరంగా తగిన సాయం అందేలా చూస్తానని హామి ఇచ్చారు. మృతు రాలు భర్త మంకీ కృష్ణ, కుటుంబ సభ్యులను ఓదార్చారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిచ్యనాయక్, మాజీ ఎంపీటీసీ లు చేగూరి వెంకటేశ్, గురిగళ్ల లక్ష్మయ్య, మండల మాజీ కో–ఆప్షన్ సభ్యుడు జహంగీర్ బాబా, నాయకులు జహంగీర్ అలీ, మహేశ్, బాను కిరణ్, మల్లయ్య, పాండు, ఎమ్మార్పీఎస్ నాయకులు ఉన్నారు.

## చౌటుప్పల్ లో ప్రజావాణి... సద్వినియోగం చేసుకోవాలి

### -చౌటుప్పల్ ఆర్డీవో వి శేఖర్ రెడ్డి

**చౌటుప్పల్, మే 03, క్రైమ్ మిర్రర్ :** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఈనెల 4వ తేదీ నుండి ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించబడునట్లు శనివారం ఆర్డిఓ వి.శేఖర్ రెడ్డి పత్రికకి ఇచ్చిన ఓ ప్రకటన ద్వారా తెలియ జేశారు. తెలంగాణ ప్రభుత్వ ఆదేశా నుసారము ప్రతి సోమవారము డివిజన్ పరిధిలోని చౌటుప్పల్, నారాయణపురం, భూదాన్ పోచంపల్లి, వలిగొండ, రామన్నపేట ఐదు మండలాలనుండి ప్రజలకు సంబంధించిన సమస్యల గురించి ప్రజావాణి నందు దరఖాస్తులను సమర్పించుటకు చౌటుప్పల్ లోని రెవెన్యూ డివిజన్ ఎంపీడీవో కార్యాలయంలోని మీటింగ్ హాల్ నందు నిర్వహించబడుతుందని ఆర్డిఓ వి.శేఖర్ రెడ్డి తెలిపారు. ఐదు మండలాల ప్రజలు ఇట్టి సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.





## అంగన్వాడీలను సద్వినియోగం చేసుకోవాలి: కౌన్సిలర్ కొల్లోజు రాజేష్ కుమార్

### గాంధీనగర్ అంగన్వాడీ కేంద్రంలో పాలు,గుడ్లు పంపిణీ

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి** ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేసే పోషక ఆహార పదార్థాలను బాలింతలు, గర్భిణీ స్త్రీలు, చిన్నారుల తల్లులు సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి మున్సిపాలిటీ 22వ వార్డు కౌన్సిలర్ కొల్లోజు రాజేష్ కుమార్ సూచించారు. శనివారం కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు గాంధీనగర్ అంగన్వాడీ కేంద్రాన్ని రాజేష్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలు, చిన్నారుల తల్లులకు కౌన్సిలర్ కొల్లోజు రాజేష్ కుమార్, అంగన్వాడీ టీచర్ ఫాతిమాతో కలిసి పౌష్టిక ఆహారంతో పాటు పాలు, గుడ్లు పంపిణీ చేశారు. అనంతరం కౌన్సిలర్ కొల్లోజు రాజేష్ కుమార్ మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే ఆహార పదార్థాల్లో ఎన్నో రకాల పోషక విలువలు ఉంటాయని అన్నారు. అంగన్వాడీ కేంద్రాలను బాలింతలు, గర్భిణీ స్త్రీలు చిన్నారుల తల్లులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

## సీఐని సన్మానించిన నాయకులు



**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి (కడ్తాల్)** రంగారెడ్డి జిల్లా కడ్తాల్ సిఐ గా బాధ్యతలు చేపట్టిన సైదిరెడ్డి ని ఆమనగల్ బ్లాక్ అధ్యక్షులు యాట నర్సింహ ముదిరాజ్ ఆధ్వర్యంలో కిసాన్ సెల్ మండల్ అధ్యక్షులు బాలరాజు, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు షాబుద్దీన్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వార్డు సభ్యులు యాదయ్య , తదితరులు ఉన్నారు.

## "పది" ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించిన నాగర్ కర్నూల్ జిల్లా

### అభినందించిన ఆర్ యు పి టి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు జగదీష్

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (నాగర్ కర్నూల్)**రాష్ట్రంలో 10వ తరగతి ఫలితాలలో నాగర్ కర్నూలు జిల్లా ద్వితీయ స్థానాన్ని సాధించినందుకు అభినందిస్తూ రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు జగదీష్ మర్యాదపూర్వకంగా జిల్లా విద్యాశాఖ అధికారిని కలిసి పుష్పగుచ్ఛమిచ్చి వారిని సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి గిరిజారమణ జిల్లా అధ్యక్షులు గౌరోజు వెంకటేశ్వర్లు శైలజ రఫీ తదితరులు పాల్గొన్నారు



# డాక్టర్ సుమంత్ కంటి హాస్పిటల్ లో ఆరోగ్యశ్రీ ,ఈ హెచ్ ఎస్ సేవలు ప్రారంభం

## కంటి సమస్యలు ఉన్న ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి డాక్టర్ పిన్నపురెడ్డి సుమంత్ రెడ్డి



**ఆత్మకూరు(ఎం) ,మే 02/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణ కేంద్రంలో డాక్టర్ సుమంత్ కంటి హాస్పిటల్ మరియు లెజర్ సెంటర్లో ప్రజలకు మరింత వైద్య సేవలు అందించడానికి ఆరోగ్యశ్రీ , ఈ హెచ్ ఎస్ సేవలను అధికారికంగా అందుబాటులోకి తెచ్చారు . ఈ సందర్భంగా ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ పిన్నపురెడ్డి సుమంత్ రెడ్డి మాట్లాడుతూ సర్వేంద్రియానం నయనం ప్రదానం అన్న చందంగా భువనగిరి పట్టణ కేంద్రంలో 2017 వ సంవత్సరంలో డాక్టర్ సుమంత్ కంటి హాస్పిటల్ ని ప్రారంభించామని తెలిపారు . ఇప్పటి వరకు సుమారు 5 వేల మందికి పైనే కంటి ఆపరేషన్లు నిర్వహించామని అన్నారు . ప్రతి నెల ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని మన హాస్పిటల్ లో ప్రతిరోజు కంటి శుక్లాల ఆపరేషన్లు చేస్తామని అన్నారు . మన దగ్గరికి వచ్చే పేషంట్లకు అధునాతన కంటి వైద్య పరికరాలతో వైద్య పరీక్షలు నిర్వహించి చూపు సమస్యలు వున్న వారికి కంటి అద్దాలు మరియు ఆపరేషన్ అవసరం వున్న వారికి అధునాతన లేజర్ టెక్నాలజీ మిషన్ లతో ఆపరేషన్లు చేస్తామని అన్నారు . హైదరాబాద్ లోని కార్పోరేట్ హాస్పిటల్ దీటుగా మన భువనగిరి పట్టణ కేంద్రంలో డాక్టర్ సుమంత్ కంటి హాస్పిటల్ లో అన్ని సౌకర్యాలతో వైద్యం అందిస్తున్నామని జిల్లాలోని ప్రజలు ఆరోగ్యశ్రీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు . ప్రధానంగా షుగర్ పేషంట్లకు కంటి సమస్య వచ్చినప్పుడు వెంటనే జాగ్రత్త పడాలని నాకు ఏమైతదని అని అశ్రద్ధ చేయొద్దని వారికి మన ఆసుపత్రిలో ప్రత్యేక చికిత్స అందిస్తున్నామని తెలిపారు . ప్రతి ఒక్కరికి సుమంత్ కంటి హాస్పిటల్ తరుపున చెబుతున్న సలహా ఎండలు బాగా కొడుతున్నాయి ప్రతి ఒక్కరూ మీ కండ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని ఎండలో తిరేగేటప్పుడు కూలింగ్ గ్లాసెస్ వాడాలని , ఆకుకూరలు , వాటర్ కంటెంట్ ఉన్న పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని సలహా ఇచ్చారు.మన సుమంత్ కంటి హాస్పిటల్ లో వైట్ రేషన్ కార్డు దారులు ఆరోగ్యశ్రీ సేవలు పొందవచ్చు ప్రభుత్వ ఉద్యోగులు అయితే ఈ హెచ్ ఎస్ సేవలను పొందవచ్చని తెలిపారు . జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా పెట్టుకొని నడిపిస్తున్న హాస్పిటల్ అని అన్నారు .

# ఘనంగా రతన్ టాటా బ్లాక్ నూతన భవనం ప్రారంభం






నర్సాపూర్‌లోని బి.వి. రాజు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ప్రాంగణంలో "రతన్ టాటా బ్లాక్ విష్ణు స్కూల్ ఆఫ్ అప్లైడ్ మేనేజ్మెంట్" నూతన భవనాన్ని ఈ రోజు ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ టెక్నాలజీ, సాఫ్ట్వేర్ అండ్ సర్వీసెస్ విభాగ అధ్యక్షులు శ్రీ వి. రాజన్న హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2007లో కీర్తిశేషులు డాక్టర్ రతన్ టాటా గారితో కలిసి పనిచేసిన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. రతన్ టాటా గారు నైతిక విలువలు, కష్టపడి పనిచేసే స్వభావం కలిగిన మహనీయుడని కొనియాడారు. యువతలో ప్రతిభను పెంపొందించేందుకు విద్యాసంస్థలు కీలక పాత్ర పోషించాలని, మెరుగైన మౌలిక వసతులు ఈ లక్ష్య సాధనలో ముఖ్యమని తెలిపారు. గ్రంథాలయాలు, అభ్యాస వసతులు విద్యార్థుల విద్యా పురోగతికి, ఉద్యోగావకాశాల సాధనకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉద్యోగాలకు ముప్పు కాదని, కొత్త అవకాశాలకు ద్వారమని తెలిపారు. ఏఐ ద్వారా తక్కువ సమయంలో సమస్యలకు పరిష్కారాలు కనుగొని సమయాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని వివరించారు. శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ శ్రీ కె.వి. విష్ణు రాజు మాట్లాడుతూ... తమ సంస్థలో మేనేజ్మెంట్ విద్యకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఇది సమాజ అభివృద్ధికి, వ్యాపార రంగ పురోగతికి ఎంతో దోహదపడుతుందని అన్నారు. టాటా సంస్థలు నైతిక విలువల ఆధారంగా వ్యాపార వ్యవస్థను నిర్మించడంలో ఆదర్శంగా నిలిచాయని, భవిష్యత్ తరాలు ఈ విలువలను కొనసాగించాలని సూచించారు. ఇంజినీరింగ్‌తో పాటు మేనేజ్మెంట్, హ్యూమానిటీస్ వంటి అన్ని విభాగాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వడం తమ లక్ష్యమని పేర్కొన్నారు. మేనేజ్మెంట్ విద్యార్థుల కోసం అత్యాధునిక సదుపాయాలతో రతన్ టాటా బ్లాక్ నిర్మించామని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రవిచంద్రన్ రాజగోపాల్, కళాశాల డైరెక్టర్ డా. కె. లక్ష్మీ ప్రసాద్, ప్రిన్సిపాల్ డా. సంజయ్ దూబే, మేనేజ్మెంట్ విభాగాధిపతి డా. ఐ. నాగేశ్వరరావు, ఇండస్ట్రీ రిలేషన్స్ డైరెక్టర్ పి. సతీష్ చంద్ర, రవి కిరణ్, డా. ఏ. రాజు, డా. శివకృష్ణన్, వివిధ విభాగాధిపతులు, డీన్లు, ఎంబీఏ విద్యార్థులు కళాశాల మేనేజర్ బి. బాపిరాజు, ఏఓ సురేష్ హాజరయ్యారు.

## "కోమాలో ఉన్న యువకుడికి ఉపాధ్యాయుల బాసట"

**మంచిర్యాల మే 2 (క్రైమ్ మిర్రర్)** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోమాలోకి వెళ్లిన ఒక నిరుపేద యువకుడిని కాపాడుకునేందుకు ఉపాధ్యాయ లోకం ముందుకొచ్చింది. హాజీపూర్ మండలం గఢ్పూర్ గ్రామానికి చెందిన జాల సాయికుమార్ వారం రోజుల క్రితం జరిగిన బైక్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. తలకు బలమైన దెబ్బ తగలడంతో మెదడులో రక్తం గడ్డకట్టి ఆయన ప్రస్తుతం కోమాలో చికిత్స పొందుతున్నారు.సాయికుమార్‌కు అత్యవసరంగా శస్త్రచికిత్స చేయాలని, ఇందుకు సుమారు రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు పేర్కొన్నారు. అంత పెద్ద మొత్తాన్ని భరించే స్తోమత లేక ఆ కుటుంబం తీవ్ర ఆవేదనలో ఉంది.సాయికుమార్ పరిస్థితిని తెలుసుకున్న మండల విద్యాధికారి (ఎంఈఓ) తిరుపతి రెడ్డి ఆసుపత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. రాక్ బెల్ట్ టీచర్స్ తరపున సేకరించిన రూ.23,500 నగదును వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న సాయికుమార్‌ను కాపాడుకునేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు, మానవతావాదులు స్పందించి ఆర్థికంగా అండగా నిలవాలని ఎంఈఓ తిరుపతి రెడ్డి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ బేర వెంకటేష్,షబీర్, వెంకటేష్,పోషన్న,భూమేష్ పాల్గొన్నారు.



## నేరేడ్మెట్ జెకె కాలనీలో సంచలనం సృష్టించిన మర్డర్ కేసు మిస్టరీని ఛేదించిన నేరేడ్మెట్ పోలీసులు

**క్రైమ్ మిర్రర్, మల్కాజిగిరి :** నేరేడ్‌మెట్ జెకె కాలనీలో సంచలనంగా మారిన హత్య కేసు మిస్టరీని నేరేడ్మెట్ పోలీసులు చేదించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నిందితుడు గవ్వల మల్లేష్ (47), వృత్తి ప్లంబర్, తన కుటుంబంతో వేరుగా ఉంటూ ఒంటరిగా అద్దె ఇంటిలో నివసిస్తున్నాడు. మృతుడు కంచి వెంకట్ రాములు (47), కూలీ పనులు చేసేవాడు. మృతుడికి, నిందితునికి లేబర్ అడ్డాలలో పరిచయం ఏర్పడి, తరచూ కలిసి మద్యం సేవించేవారు.
గత ఏడాది డిసెంబర్ 15న హెచ్‌బీ కాలనీ వద్ద ఇద్దరూ పని కోసం వెళ్లి పని దొరకకపోవడంతో మద్యం సేవించారు. తర్వాత మల్లేష్ ఇంటికి వెళ్లి మద్యం తాగుతున్న సమయంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. వ్యక్తిగత విషయాలపై అవమానకరంగా మాట్లాడటంతో ఆగ్రహించిన మల్లేష్, క్రతతో వెంకట్ రాములుపై బలంగా దాడి చేసి చంపేశాడు.హత్య అనంతరం మృతదేహాన్ని తాడుతో కట్టేసి వంటగది ప్లాట్‌ఫామ్ కింద దాచాడు. ఆపై ఇటుకలతో గోడకట్టి మూసివేసి అక్కడి నుంచి పరారయ్యాడు.కొన్ని నెలల తర్వాత ఇంటి యజమానికి దుర్వాసన రావడంతో అనుమానం వచ్చి తాళాలు పగులగొట్టి చూడగా, వంటగది కింద నుంచి పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహం బయటపడింది. దీంతో ఏప్రిల్ 17న కేసు వెలుగులోకి వచ్చింది.టెక్నికల్ ఆధారాలు, సమాచారం ఆధారంగా పోలీసులు విచారణ జరిపి మల్లేష్‌ను మే 1న జూబ్లీ బస్ స్టాండ్ వద్ద అదుపులోకి తీసుకున్నారు.ఈ కేసును డీసీపీ శ్రీధర్, ఏసీపీ యాదగిరి రెడ్డి పర్యవేక్షణలో, నేరేడ్మెట్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సందీప్ కుమార్ బృందం చేదించినట్లు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**చేవెళ్ల (రంగారెడ్డి జిల్లా): క్రైమ్ మిర్రర్** షాబాద్ మండలం పోతుగల్ గ్రామానికి చెందిన మల్కమోల్ల నర్సింలు (50) రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. నర్సింలు హైదరాబాదులోని ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ, ప్రతిరోజూ పోతుగల్ నుంచి బయలుదేరి విధులకు హాజరవుతుండేవారు.
శనివారం ఉదయం సుమారు 6:30 గంటలకు ఇంటి నుంచి బైక్ (టీఎస్09ఖీ0726)పై బయలుదేరిన ఆయన, పామేనా గేటు సమీపానికి చేరుకోగానే చేవెళ్ల నుంచి షాద్‌నగర్ వైపు వెళ్తున్న లారీ(టీఎస్04వీ8312) అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. అనంతరం నియంత్రణ కోల్పోయిన లారీ, ఎదురు దిశగా వస్తున్న నర్సింలు బైక్‌ను ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదం అనంతరం లారీ పొలాల్లోకి దూసుకెళ్లింది.
స్థానికుల సమాచారం ప్రకారం, రోడ్డుపై వర్షపు నీరు వెళ్ళడానికి ఏర్పాటు చేసిన ఖానాల కారణంగా అక్కడ రహదారి కుంగిపోవడం ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని తెలుస్తోంది. బెంగళూరు నేషనల్ హైవేను ముంబై నేషనల్ హైవేతో కలిపే ఈ లింక్ రోడ్డులో ఇలాంటి ప్రమాదకర ప్రాంతాలు దాదాపు 20 వరకు ఉన్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే ప్రాంతంలో గతంలో కూడా ఒకరు ప్రాణాలు కోల్పోయిన ఘటన చోటుచేసుకున్నట్లు తెలిపారు.
సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి:





**సీపీ అంబర్ కిషోర్ ఝా**

**గంజాయి వినియోగంపై సీసీసీ నస్పూర్‌లో అవగాహన సదస్సు**

**డ్రగ్స్ రహిత సమాజానికి యువత సహకరించాలి**

**నిఘా ముమ్మరం చేశాం.. సమాచారం ఇస్తే కఠిన చర్యలు**

**నస్పూర్ మే 2 (క్రైమ్ మిర్రర్)** యువత తమ ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, సమాజం సురక్షితంగా ఉండాలంటే డ్రగ్స్‌కు 'నో' చెప్పాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పిలుపునిచ్చారు. శనివారం మంచిర్యాల రూరల్ సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో నస్పూర్‌లోని ఎన్.ఎన్. గార్డెన్‌లో గంజాయి వినియోగం – దుష్పరిణామాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.
ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ డ్రగ్స్ వాడటం వల్ల వ్యక్తిగత ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా కుటుంబాలు వీధిన పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్నేహితులు, సన్నిహితులు మత్తు మార్గంలోకి వెళ్లకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉందన్నారు. మాదకద్రవ్యాల సరఫరా లేదా విక్రయాలపై ఎలాంటి సమాచారం ఉన్నా వెనువెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు.కమిషనరేట్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా,నిల్వపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు సీపీ స్పష్టం చేశారు.రైల్వే స్టేషన్లు,బస్ స్టాండ్లు,బహిరంగ ప్రదేశాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఇప్పటికే మత్తుకు బానిసైన వారిని గుర్తించి,వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చి, అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ ఎన్. వెంకటేశ్వర్లు,జిల్లా సంక్షేమ అధికారి రహుఫ్,మంచిర్యాల రూరల్ సీఐ రవీందర్, నార్కోటిక్స్ ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్,నస్పూర్ ఎస్సై ప్రశాంత్,హాజీపూర్ ఎస్సై కిరణ్ కుమార్,పలువురు పోలీస్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల అక్రిడిటేషన్ పరిమితిని తొలగించాలి

## మీడియా అకాడమీకి శేరిలింగంపల్లి మండల జర్నలిస్టుల విన్నపం.....

?శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ :మండల స్థాయిలో జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల సంఖ్యపై ప్రభుత్వం విధించిన పరిమితిని వెంటనే సడలించాలని, క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ న్యాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (టీ యు డబ్ల్యు జె )జేశేరిలింగంపల్లి మండల కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం మీడియా అకాడమీ చైర్మన్‌కు రాసిన వినతి పత్రాన్ని జర్నలిస్టులు విడుదల చేశారు.

**?వినతి పత్రంలో జర్నలిస్టులు పేర్కొన్న ముఖ్యాంశాలు ఇవే:**

1) ప్రస్తుతం ఒక పత్రికకు కేవలం ఇద్దరికి (1o1) మాత్రమే అక్రిడిటేషన్ కార్డులు పరిమితం చేయడం వల్ల, అదే పత్రికలో దశాబ్దాలుగా పనిచేస్తున్న ఇతర విలేకరులు గుర్తింపు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వార్తల పరిధి పెరిగిన దృష్ట్యా ఎక్కువ మంది విలేకరుల అవసరం ఉందని, ఈ పరిమితి వల్ల అర్హత ఉన్న మెజారిటీ జర్నలిస్టులు ప్రభుత్వ ప్రయోజనాలకు దూరమవుతున్నారని పేర్కొన్నారు. అధికారిక గుర్తింపు కార్డులు లేకపోవడం వల్ల ప్రభుత్వ కార్యక్రమాల



కవరేజీలో జర్నలిస్టులకు రక్షణ, గుర్తింపు కరువవుతోందని, ఇది జర్నలిజం వృత్తిపై ఆధారపడిన వారి భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో కార్డులు కలిగి ఉండి, ప్రస్తుత కొత్త 'కోటా' నిబంధనల వల్ల కార్డులు కోల్పోతున్న సీనియర్ జర్నలిస్టుల పరిస్థితిని ప్రత్యేకంగా పరిశీలించాలని కోరారు.

**డిమాండ్.....**

?పత్రికల సర్క్యులేషన్ మరియు క్షేత్రస్థాయి అవసరాల ప్రాతిపదికన కార్డుల సంఖ్యను పెంచాలని యూనియన్ నేతలు కోరారు. మీడియా అకాడమీ మరియు యూనియన్ పెద్దలు ప్రభుత్వంపై సానుకూల ఒత్తిడి తెచ్చి, ఈ అహేతుకమైన పరిమితిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు.
?ఈ విజ్ఞప్తి చేసిన వారిలో శేరిలింగంపల్లి మండల టీ యు డబ్ల్యూ జే శేరిలింగంపల్లి ప్రెసిడెంట్ కొండ విజయ్ కుమార్, జిల్లా నాయకులు మాధవ్ రెడ్డి, సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్టులు శ్యామ్, మల్లేష్,భూమేష్, విజయ్, ప్రవీణ్, నరేష్, గిరి, శంకర్, షర్ఫుద్దీన్, ప్రవీణ్, నర్సింహా, షఫీ, శశి, మల్లేష్, రత్నం, సింహాద్రి, నగేష్ తదితరులు పాల్గొన్నార



### త్రిపురారం: మత్స్యకారులకు చిక్కిన భారీ చేప..!

## పెద్దదేవులపల్లి రేజర్వాయర్ లో 30 అరుదైన భారీ వాలుగా చేప.. ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నా గ్రామస్తులు, మత్స్యకారులు

**క్రైమ్ మిర్రర్, త్రిపురారం ప్రతినిధి:** నల్గొండ జిల్లా, త్రిపురారం మండలము పరిధిలోని పెద్దదేవులపల్లి గ్రామంలోని రేజర్వాయర్ లో శుక్రవారం జాలర్లకు అరుదైన భారీ వాలుగా చేప చిక్కిన ఘటన స్థానికంగా ఆసక్తి రేకెత్తిస్తోంది. సాధారణంగా చిన్న పరిమాణంలో కనిపించే ఈ జాతి చేప, ఈసారి అసాధారణంగా పెద్దదిగా చిక్కడంతో గ్రామస్తులు, మత్స్యకారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. జాలర్లు తెల్లవారుజామున వేటకు వెళ్లిన సమయంలో వారి వలలో ఈ భారీ చేప చిక్కింది. దాన్ని తీరం వద్దకు తీసుకొచ్చిన తర్వాత దాని బరువు, పొడవు చూసి స్థానికులు గుమిగూడారు. కొన్ని నివేదికల ప్రకారం, ఈ చేప బరువు 30 కిలోల వరకు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. మత్స్యకారులు ఈ విషయాన్ని గమనించి, ఇది అరుదుగా పెద్ద పరిమాణంలో పెరిగే వాలుగా చేప జాతికి చెందినదిగా పేర్కొన్నారు. సముద్రంలో ఆహారం సమృద్ధిగా లభించడం, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉండడం వల్ల ఈ చేప ఇంత పెద్దదిగా పెరిగి ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నారు. ఈ చేపను స్థానిక మార్కెట్‌లో వేలం వేయగా, మంచి ధర పలికినట్లు సమాచారం. ఇటువంటి అరుదైన చేపలు జాలర్లకు అదృష్టంగా భావించబడుతాయి.

## ఆర్టీసీ బస్ స్టేషన్ లో చలివేంద్రం ప్రారంభం




**చౌటుప్పల్, మే 3, క్రైమ్ మిర్రర్ :** చౌటుప్పల్ లోని ఆర్టీసీ బస్ స్టేషన్ లో స్థానిక శ్రీ బాలాజీ షాపింగ్ మాల్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం ప్రముఖ వ్యాపారవేత్త శ్రీబాలాజీ షాపింగ్ మాల్ యజమాని కృష్ణ రామ్ చౌదరి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాలుగా బస్ స్టేషన్ ప్రాంగణంలో వేసవి కాలంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రయాణికుల దప్పిక తీర్చేందుకు తాము ఈ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం చేపడతామని తెలిపారు. వ్యాపారంతో పాటు తాము సమాజ సేవలోను ముందు ఉంటామని పేర్కొన్నారు . ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కంట్రోలర్లు బొప్పని ఆనందరావు, యాదయ్య, స్థానికులు కాసుల రఘు, ముత్యాల హనుమంత రెడ్డి, రాజేష్, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

# సర్కారు బడుల్లో.. 'కొత్త వెలుగు'

- అడ్మిషన్ల జోరు...నాణ్యమైన విద్య
- పోషకాహారంతో ఆకట్టుకుంటున్న ప్రభుత్వ పాఠశాలలు
- మధ్యాహ్న భోజనం, రాగి జావాతో విద్యార్థుల ఆరోగ్యం
- డిజిటల్ విద్య, మెరుగైన సదుపాయాలు






**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి**

జయశంకర్ జిల్లాలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యా వ్యవస్థలో గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. గతంలో ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపిన తల్లిదండ్రులు, ఇప్పుడు సర్కారు బడుల వైపు మళ్లుతున్నారు. దీనికి ప్రధాన కారణం పాఠశాలల్లో పెరుగుతున్న మౌలిక సదుపాయాలు, నాణ్యమైన బోధన, విద్యార్థులకు అనుకూల వాతావరణం కల్పించడం. ప్రభుత్వం తీసుకుంటున్న సంస్కరణలతో పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు, డిజిటల్ బోధన, శుభ్రమైన తరగతి గదులు, తాగునీరు, టాయిలెట్ సదుపాయాలు వంటి మౌలిక వసతులు విద్యార్థుల చదువుపై ఆసక్తిని పెంచుతున్నాయి. దీంతో విద్యార్థుల హాజరు శాతం కూడా గణనీయంగా పెరుగుతోంది. ఇక విద్యార్థుల ఆరోగ్యంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. మధ్యాహ్న భోజన పథకం కింద పోషకాహారాన్ని అందిస్తూ పిల్లల శారీరక, మానసిక అభివృద్ధికి తోడ్పడుతోంది. తాజాగా



రాగి జావా, గుడ్లు, పాలు వంటి న్యూట్రిషన్ ఫుడ్‌ను అందించడం ద్వారా పిల్లల్లో పోషకాహార లోపాలను తగ్గించే దిశగా చర్యలు తీసుకుంటోంది. ఈ ఆహారం వల్ల విద్యార్థుల్లో శక్తి, ఏకాగ్రత పెరుగుతున్నట్లు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు. పాఠశాలల్లో విద్యార్థుల కోసం స్నేహపూర్వక వాతావరణం, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వడం కూడా మరో ముఖ్య అంశంగా మారింది. విద్యతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థుల ప్రతిభను వెలికితీయడానికి ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈ మార్పుల ఫలితంగా ప్రతి ఏడాది సర్కారు బడుల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతుండటం విశేషం. గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా పట్టణాల్లో కూడా ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెరుగుతోంది. మొత్తంగా చూస్తే, సర్కారు బడులు ఇప్పుడు నాణ్యమైన విద్యకు చిరునామాగా మారుతున్నాయి. విద్యార్థుల భవిష్యత్తు బాటను బలపరుస్తూ, సమాజంలో సమాన విద్యావకాశాలను కల్పించే దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు అభినందనీయం.

# ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలి

## -రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది
## -అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం కీలకం...
## -ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి
## -స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు






**యాదాద్రి జిల్లా, మే 03, క్రైమ్ మిర్రర్:**
ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకు పారదర్శకంగా సేవలందించాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు.ప్రజా పాలన – – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం భువనగిరి పట్టణం రాయగిరిలోని సోమా రాధాకృష్ణ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశానికి ముఖ్య అతిధిగా భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రగతి కార్యక్రమాలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రతి శాఖలో జరుగుతున్న పనుల పురోగతిని అధికారులు సమగ్రంగా వివరించగా, క్షేత్ర స్థాయిలో అమలు అవుతున్న పథకాలపై ఎక్కడైనా లోపాలు ఉన్నా వాటిని వెంటనే గుర్తించి, ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు.

ప్రభుత్వం ప్రజల సంక్షేమం,రాష్ట్ర అభివృద్ధి రెండింటినీ సమతుల్యంగా ముందుకు తీసుకెళ్తోందని స్పష్టం చేశారు. ప్రజల అవసరాలే ప్రభుత్వానికి ప్రాధాన్యతగా తీసుకుని,ప్రతి కుటుంబానికి నేరుగా ప్రయోజనం చేకూరే విధంగా పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు.మహిళల సాధికారత కోసం ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమలు చేస్తూ, మహాలక్ష్మి పథకం ద్వారా ఉచితంగా మహిళలకు బస్ లో ప్రయాణం చేస్తున్నారని, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తూ కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గిస్తున్నామని తెలిపారు.పేద ప్రజల ఆహార భద్రతను దృష్టిలో ఉంచుకుని సన్నబియ్యం పంపిణీకి చేయడం జరుగుతుందన్నారు.అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు జారీ చేయడం జరిగింది అని తెలిపారు.

రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొంటూ, సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందించడం ద్వారా రైతులకు ప్రోత్సాహం అందిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెడుతూ ఆయిల్ ఫామ్ సాగుకు ప్రత్యేక రాయితీలు అందిస్తూ రైతుల ఆదాయం పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా పండుగ వాతావరణంలో కొనసాగుతోందని, భువనగిరి నియోజకవర్గంలో ఇప్పటికే 3,500 ఇళ్లు మంజూరు కాగా, రెండో విడతలో మరిన్ని ఇళ్ల మంజూరుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ రాష్ట్రంలో ఇల్లు లేని ఒక్క కుటుంబం కూడా ఉండకూడదనేది ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు.

ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.5 లక్షల నుండి రూ.10 లక్షలకు పెంచి పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందిస్తూ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు.విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో



ఉంచుకుని జూన్ 2వ తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహార పథకాన్ని ప్రారంభించనున్నట్లు, అలాగే ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించే కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు వెల్లడించారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడం ద్వారా ప్రభుత్వంపై నమ్మకం పెంపొందించాల్సిన అవసరం ఉందని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు.

### లిఅభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం కీలకం...

ప్రజా పాలన– ప్రగతి ప్రాణాళిక కార్యక్రమంలో భాగంగా జరిగిన సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పాల్గొని మాట్లాడుతూ... సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందించడం జరుగుతుంది అన్నారు. అభివృద్ధి,సంక్షేమ పథకాలను, అమలు కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటుగా ప్రజల అవసరాలను స్థానికంగా తెలుసుకుని త్వరితంగా పరిష్కరించడం ఈ ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమన్నారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ, భువనగిరి మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి, వైస్ చైర్మన్ మంజుల,భువనగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ రేఖా బాబు రావు,మండల, గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.